# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-03-2026                    సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశ వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థులు మరువకూడదని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఉద్బోధించారు.
- ❖ ఇంధన, ఆహార సంక్షోభాల నుండి భారత్ సురక్షితంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.
- ❖ దేశంలో ప్రతి 45 రోజులకు ఒక విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నామని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ దేశాభివృద్ధి కోసం ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం మధ్య సమతుల్యత అవసరమని కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్  అన్నారు.
- ❖ భారతదేశం ఒక శక్తివంతమైన ఫార్మా ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

=======================

ఈ రోజు రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ఆత్మనిగ్రహం, దాతృత్వం, పేదల పట్ల కరుణ కలిగి ఉండాలనే సందేశాన్ని ఇస్తుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ పవిత్ర సందర్భం అందరిలో ఆశను, సామరస్యాన్ని, కరుణను నింపాలని, అందరి జీవితాల్లోకి ఆనందాన్ని, విజయాన్ని తీసుకురావాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. ఈ పండుగ.. అంతటా సోదరభావాన్ని, దయను పెంపొందించాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో.. ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

=======================

భారతదేశ సంపన్నమైన, వైవిధ్యభరితమైన సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థులు మరువకూడదని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో ఈ రోజు జరిగిన 29వ జాతీయ యువజన పార్లమెంట్ లో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. ఆధునిక, ప్రగతిశీల ఆలోచనా విధానాన్ని అనుసరిస్తూనే.. భారతదేశ ఔన్నత్యాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. భారతదేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కీలక భూమిక పోషిస్తుందని వివరించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో యువత ముఖ్య పాత్ర పోషించాలని ఉపరాష్ట్రపతి తెలియజేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనకు ఈద్, పర్షియన్ నూతన సంవత్సరం- నౌరూజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకువస్తుందని ఇరువురు నాయకులు ఆకాంక్షించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విషయాన్ని పంచుకున్నారు. ప్రాంతీయ స్థిరత్వానికి విఘాతం కలిగిస్తూ.. ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీసే విధంగా పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ఇంధన, ఆహార సంక్షోభాల నుండి సురక్షితంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా హల్ద్వానీలో ఈరోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పశ్చిమాసియాలో జరుగుతున్న దాడులు కేవలం భారతదేశానికే కాకుండా ప్రపంచం మొత్తానికి ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఏదైనా సమస్యకు చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కారం కనుగొనాలనేది భారత్ విధానమని వివరించారు. ఈ వివాదాలపై భారతదేశం స్పష్టమైన వైఖరిని అవలంబిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం ఒక శక్తివంతమైన ఫార్మా ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... గత పదేళ్లలో భారతదేశ ఆరోగ్య రంగం దిగుమతులపై ఆధారపడే స్థాయి నుండి స్వదేశీ సామర్థ్యాలతో నడిచే స్థాయికి చేరుకుందన్నారు. భారతీయ హెల్త్‌కేర్, మెడ్‌టెక్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలు, స్వదేశీ ఆవిష్కరణలు, పరిశోధనలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆయన తెలిపారు. అనుసంధాన్, నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, మహా మెడ్‌టెక్ మిషన్ వంటి కార్యక్రమాలు పరిశోధనా వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయని జితేంద్ర సింగ్ చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ప్రతి 45 రోజులకు ఒక విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నామని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. విశాఖపట్టణంలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఉడాన్ పథకం ద్వారా సామాన్యుడికి విమాన ప్రయాణం అందుబాటులోకి వచ్చిందని, ఎన్డీయే

హయాంలోనే విమానాశ్రయాల సంఖ్య 167కు చేరిందన్నారు. స్వదేశీ తయారీ విమానాలు అందుబాటులోకి వస్తే.. దేశీయ సర్వీసులు మరింత విస్తృతమవుతాయని తెలిపారు. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు విమానయాన రంగంపై ప్రభావం చూపుతున్నాయని రామ్మోహన్ నాయుడు తెలియజేస్తూ…

(వాయిస్ 21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ `వరల్డ్ వాటర్ డే కాంక్లేవ్ 2026`ను ఈ నెల 23వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించనుంది. కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ ఈ సదస్సును ప్రారంభిస్తారు. “పరిశ్రమల కోసం నీరు” అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సదస్సు… సుస్థిర నీటి నిర్వహణ కోసం చర్చలు, ఆవిష్కరణలు, పరస్పర సహకారానికి ఒక జాతీయ వేదికగా నిలుస్తుందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశాభివృద్ధి కోసం ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం మధ్య సమతుల్యత అవసరమని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా ఉత్తరాఖండ్ -డెహ్రాడూన్‌లో రెండు రోజుల జాతీయ కార్యశాలను కేంద్రమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ… ప్రకృతి పరిరక్షణలో భారతదేశ నిబద్ధతను, సాధించిన విజయాలను వివరించారు. పరిరక్షణ ప్రయత్నాలలో "ప్రకృతికే మొదటి ప్రాధాన్యత" ఇవ్వాలని తెలిపారు. ప్రకృతితో సామరస్యపూర్వక సహజీవనాన్ని అలవర్చుకున్నప్పుడు మాత్రమే భూమి నివాసయోగ్యంగా ఉంటుందని భూపేందర్ యాదవ్ స్పష్టం చేస్తూ…

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళం తన సరికొత్త అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ `తారాగిరి` (F-41) నౌకను ఏప్రిల్ 3వ తేదీన విధుల్లోకి చేర్చుకోనుంది. విశాఖపట్టణంలో జరగనున్న ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటారు. మునుపటి డిజైన్ల కంటే ఇది ఎంతో ఆధునికమైనదని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రాడార్ క్రాస్-సెక్షన్ (Radar Cross-Section) గణనీయంగా తగ్గించడంతో.. రాడార్లకు చిక్కకుండా శత్రువులపై మెరుపు దాడులు చేయగల సామర్థ్యం దీనికి ఉందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత పశ్చిమ ప్రాంతం నుండి ఇరాన్‌పై బాంబు దాడులు చేయడానికి సైనిక సహకారం అందించాలని అమెరికా కోరినట్లు వస్తున్న వార్తలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఈ రోజు ఖండించింది. ఇవన్నీ అవాస్తవాలని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాలలో వస్తున్న ఇటువంటి తప్పుడు, నిరాధారమైన వార్తల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆ మంత్రిత్వ శాఖ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిశా, పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) ఈ రోజు పేర్కొంటూ.. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అదే విధంగా రేపు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మరాఠ్వాడా, కర్ణాటక, అరుణాచల్ ప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, తమిళనాడు,

పుదుచ్చేరిలలోని కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన ఉరుములు సంభవించవచ్చని ఐఎండీ అంచనా వేసింది.

========================
========================